
సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం । 22 । జూలై । 2023



సోమశిలలో 24.82 టీఎంసీలు

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో శుక్రవారానికి 24.82 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 1502 క్యూసెక్కుల ప్రవాహం వచ్చి చేరుతోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.61,310
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.5,506
3శాతం జీఎస్టీతో	రూ.5,671
నవర (8గ్రా)	రూ.45,368



వాతావరణం

వాతావరణంలో తేమ 64 శాతం ఉంది. జిల్లావ్యాప్తంగా కొన్ని మండలాల్లో ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు శనివారం కురుస్తాయని అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

మత్స్యకార లబ్ధిదారులకు ఫిష్ ఆంధ్ర మొబైల్ వ్యాన్లు



లబ్ధిదారులకు ఫిష్ ఆంధ్ర మొబైల్ వ్యాన్లను అందజేస్తున్న జేసీ కూర్మనాథ్, తదితరులు

నెల్లూరు (దర్గామిట్ట): మత్స్యకార కుటుంబాల స్వయం ఉపాధి మరింత మెరుగుపడేలా రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీతో నూతన ఫిష్ ఆంధ్ర మొబైల్ వ్యాన్లను అందిస్తోందని జాయింట్ కలెక్టర్ ఆర్.కూర్మనాథ్ తెలిపారు. కలెక్టరేట్ ఆవరణలో జేసీ కూర్మనాథ్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ డీ నిరంజన్‌బాబురెడ్డి, మత్స్యశాఖ జేడీ నాగేశ్వరరావుతో కలిసి ఒక్కొక్కటి రూ.4.62 లక్షల విలువగల రెండు ఫిష్ ఆంధ్ర మొబైల్ వ్యాన్లను మత్స్యకార లబ్ధిదారులైన కోవూరు మండలం పెద్దపడుగుపాడుకు చెందిన ఎస్ రాఘవేంద్ర, సైదాపురానికి చెంది న కేఅనంతయ్యకు శుక్రవారం అందజేశారు. ఇందులో రూ.1.8 లక్షలు సబ్సిడీ కాగా, లబ్ధి దారుడి వాటా రూ.2.82 లక్షలు. జిల్లా వ్యవసాయ శాఖాధికారి సుధాకర్‌రాజు, మత్స్యకారులు పాల్గొన్నారు.

డీసీఎమ్మెస్ చైర్మన్ పదవీకాలం పొడిగింపు



వీరి చలపతిరావు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లా కేంద్ర సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎమ్మెస్) చైర్మన్‌గా వీరి చలపతిరావు మరో ఆరు నెలల పాటు పదవిలో కొనసాగిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 20తో ఆయన పదవీ కాలం ముగియడంతో ప్రభుత్వం మరో ఆరునెలలు పదవిలో కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో 2024 జనవరి 20వ తేదీ వరకు ఆయనతో పాటు మరో ఆరుగురు డైరెక్టర్లు కూడా పదవుల్లో కొనసాగనున్నారు.

రేపటి నుంచి రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు



బ్యాడ్మింటన్ క్రీడాకారులతో అసోసియేషన్ నాయకులు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో రాష్ట్రస్థాయి అండర్ -17 బాల బాలికల బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం నుంచి 25వ తేదీ వరకు జరుగుతాయని ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ తెలిపారు. ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జిల్లా జట్టుకు క్రీడా దుస్తులను శుక్రవారం బహుకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీలకు క్వాలిఫైయింగ్ మ్యాచ్‌లను శనివారం నిర్వహిస్తామన్నారు. 13 జిల్లాల నుంచి 300 మంది క్రీడాకారులు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నిమ్మల వీర వెంకటేశ్వర్లు, కోశాధికారి గాదంశెట్టి వెంకట శ్రీకాంత్, తాళ్లపాక వరప్రసాద్, కోచ్ వెంకటేష్ పాల్గొన్నారు.

782 పొగాకు బేళ్ల కొనుగోలు

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): డీసీపల్లి వేలం కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన పొగాకు వేలంలో డీసీపల్లి క్లస్టర్ రైతుల నుంచి 782 పొగాకు బేళ్లు కొనుగోలు చేశామని వేలం నిర్వహణాధికారి జీ రాజశేఖర్ తెలిపారు. మొత్తం 795 బేళ్లను రైతులు వేలం కేంద్రానికి తీసుకురాగా, 13 బేళ్లను వివిధ కారణాలతో వేలం నుంచి తిరస్కరించామన్నారు. కిలో పొగాకు అత్యధిక ధర రూ.252, అత్యల్ప ధర రూ.150, సగటు ధర రూ.238.66 చొప్పున నమోదైందన్నారు. రైతుల వద్ద లక్ష కిలోలకుపైగా పొగాకును 13 కంపెనీల బయ్యర్లు వేలంలో పాల్గొని 2 కోట్ల, 42 లక్షల, 32 వేల రూపాయల ధరకు కొనుగోలు చేశారని తెలిపారు.

వరి విత్తనాలు అందుబాటులో

నెల్లూరు(సెంట్రల్): నెల్లూరులోని కృషి విజ్ఞాన కేంద్రంలో బీపీటీ-5204 (పునాది విత్తనం) అందుబాటులో ఉందని, కావాల్సిన రైతులు తీసుకోవచ్చని కేవీకే సమన్వయకర్త లలితా శివజ్యోతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 25 కేజీల బస్తా రూ.1000 అని పేర్కొన్నారు. కావాల్సిన రైతులు 79816 44675 నంబర్‌ను సంప్రదించి వివరాలు తెలుసుకోవాలని సూచించారు.

పారిశ్రామికీకరణ రయ్.. రయ్



రాష్ట్రానికే తలమానికంగా జిల్లాలోని ముత్తుకూరు మండలం పారిశ్రామికీకరణలో పరుగులు తీస్తోంది. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో కృష్ణపట్నం పోర్టు ఏర్పడ్డాక ఈ ప్రాంత రూపురేఖలే మారిపోయాయి. ఇక్కడ నిర్మితమైన పామాయిల్ ఫ్యాక్టరీలు ఎంతో మందికి ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నాయి. ఇప్పటికే ఎనిమిది ఫ్యాక్టరీలను నిర్మించగా, మరో నాలుగు నిర్మాణ దశలో ఉన్నాయి.

ముత్తుకూరు మండలంలో రూ.వందల కోట్లతో ఫ్యాక్టరీలు

- వివిధ రాష్ట్రాలకు పామాయిల్ రవాణా
- స్థానిక, స్థానికేతరులకు ఉపాధి
- వందల సంఖ్యలో అద్దె గదులు
- భూముల ధరలకు రెక్కలు

నిర్మాణంలో ఉన్న పామాయిల్ శుద్ధి ఫ్యాక్టరీ



ముత్తుకూరు: మండలంలోని పంటపాళెం పంచాయతీ పారిశ్రామికంగా పరుగులు తీస్తోంది. ఇక్కడ ఏర్పాటైన పామాయిల్ ఫ్యాక్టరీలు జిల్లాకే తలమానికంగా మారాయి. వేల మంది స్థానిక, స్థానికేతరులకు ఉద్యోగావకాశాలను కల్పిస్తూ ఈ ప్రాంత రూపురేఖలనే మార్చేశాయి. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలో ప్రారంభమైన కృష్ణపట్నం పోర్టుతో పామాయిల్ ఫ్యాక్టరీలు పురుడుపోసుకున్నాయి. పోర్టు నుంచి జాతీయ రహదారి వద్ద రామదాసుకండ్రిగ వరకు నిర్మించిన బైపాస్ రోడ్డు పొడవునా ఫ్యాక్టరీలు వెలిశాయి.

ఎనిమిది పామాయిల్ ఫ్యాక్టరీలు

కృష్ణపట్నం పోర్టు ఆధారంగా ఎనిమిది పామాయిల్ ఫ్యాక్టరీలను నిర్మించారు. కృష్ణపట్నం పోర్టు నుంచి పైప్‌లైన్ ద్వారా విడుదలయ్యే ముడి చమురును ఇవి శుద్ధి చేస్తున్నాయి. ట్యాంకర్ల ద్వారా తమిళనాడు, కర్ణాటక, కేరళ, తెలంగాణ రాష్ట్రాలకే కాకుండా దేశంలోని మారుమూల ప్రాంతాలకూ పామాయిల్‌ను రవాణా చేస్తున్నారు. వీటికి అదనంగా పంటపాళెం పంచాయతీలో మూడు పరిశ్రమలు, దొరువులపాళెం పంచాయతీలో మరొకటి నిర్మాణంలో ఉన్నాయి.

వేలాది మందికి ఉపాధి

ఉత్పత్తి సామర్థ్యాన్ని బట్టి ఒక్కో పరిశ్రమను రూ.800 కోట్ల నుంచి రూ.వెయ్యి కోట్లతో నిర్మిస్తున్నారు. ఉత్పత్తి జరిగే పామాయిల్ ఫ్యాక్టరీల్లో 200 మంది పర్మనెంట్ ఉద్యోగులు, 200 మందికిపైగా తాత్కాలిక ఉద్యోగులు పనిచేస్తున్నారు. పంటపాళెం, ఈపూరు, నారికేళపల్లి, దొరువులపాళెం పంచాయతీల్లో ఒడిశా, జార్ఖండ్, బిహార్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన కార్మికులు నివాసముంటున్నారు. నిర్మాణంలో ఉన్న నాలుగు పరిశ్రమల్లో దాదాపు రెండు వేల మందికిపైగా రాష్ట్రేతర కార్మికులు తాత్కాలిక పద్ధతిలో పనిచేస్తున్నారు. వీరి నివాసం కోసం కాంట్రాక్టర్లు వివిధ గ్రామాల్లో రేకుల షెడ్లు ఏర్పాటు చేశారు. ఉత్పత్తి జరుగుతున్న పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు పంటపాళెం, ఈపూరు, దొరువులపాళెం, నారికేళపల్లి పంచాయతీల్లో అద్దె గదుల్లో నివాసం ఉంటున్నారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలను కల్పించారు. వీరికి వేతనాలను బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తున్నారు.

పామాయిల్ రవాణాలో 400 ట్యాంకర్లు

పామాయిల్ ఫ్యాక్టరీలతో సుమారు 400 వరకు ట్యాంకర్లతో స్థానిక, స్థానికేతర యజమానులు ఆయిల్ రవాణా చేయడంలో నిమగ్నమయ్యారు. పామాయిల్ లోడ్ చేసుకునేందుకు ఫ్యాక్టరీల వద్ద ఇవి బారులుదీరుతున్నాయి. మరోవైపు పరిశ్రమలకు అవసరమైన మంచినీటి రవాణాలో 50కుపైగా ట్యాంకర్లు తిరుగుతున్నాయి. వందల సంఖ్యలో డ్రైవర్లు, క్లీనర్లు వీటిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు.

పామాయిల్ ఉత్పత్తి చేస్తున్న ఫ్యాక్టరీలు

- జెమినీ ఎడిబుల్, ఫ్యాట్స్
- అదానీ విల్మర్ (రెండు పరిశ్రమలు)
- ట్రిపుల్ ఎఫ్ ఇండస్ట్రీస్
- శ్రీకృష్ణ సాతిండియా ఫ్యాక్టరీ
- సంతోషిమాత ఆయిల్స్
- కార్గిల్ ఆయిల్స్
- ఇమామీ ఆగ్రోటెక్

నిర్మాణంలో ఉన్న పరిశ్రమలు

- బొంగె ఆయిల్స్
- అనా ఆయిల్స్
- గోకుల్ ఆగ్రోటెక్ (దొరువులపాళెం)
- కోస్టల్ ఆయిల్స్ (చిన్న ఫ్యాక్టరీ)

మారిన గ్రామాల ముఖచిత్రం

పామాయిల్ ఫ్యాక్టరీల ఏర్పాటుతో పంటపాళెం, ఈపూరు, దొరువులపాళెం పంచాయతీల రూపురేఖలు మారిపోయాయి. నూతన భవన నిర్మాణాలు జరగ్గా, పెద్ద సంఖ్యలో కొత్త దుకాణాలు వెలిశాయి. పోర్టు బైపాస్‌కు ఇరువైపులా భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ఉపాధి, ఉద్యోగావకాశాలు మెరుగుపడ్డాయి. కార్మికులకు అద్దెకు ఇచ్చేందుకు గానూ ఈ గ్రామాల్లో పెద్ద సంఖ్యలో గదులను నిర్మించారు. సీఎస్సార్ నిధులతో బస్‌షెల్టర్లు, ఆర్వో ప్లాంట్లు, పాఠశాలల్లో అదనపు గదులను నిర్మించారు. పంటపాళెం పంచాయతీలో చెత్తను తొలగించేందుకు ట్రాక్టర్‌ను సమకూర్చారు. పచ్చదనం కోసం మొక్కలు నాటుతున్నారు.



పరిశ్రమలకు కేంద్రంగా మారిన పోర్టు బైపాస్ రోడ్డు



కార్మికులకు ఏర్పాటు చేసిన తాత్కాలిక షెడ్లు



విధులకు వెళ్తున్న జార్ఖండ్ కార్మికులు

పక్కాగా నిబంధనల అమలు



ఫ్యాక్టరీల్లో చట్టాలు, నిబంధనలను పక్కాగా అమలు చేస్తున్నారు. స్థానిక, స్థానికేతర కార్మికులు, ఉద్యోగులకు మంచి వేతనాలను అందజేస్తున్నారు. ప్రమాదాలకు తావులేకుండా భద్రత ప్రమాణాలను పాటిస్తున్నారు.

– మారు సుధాకర్‌రెడ్డి, పంటపాళెం

కార్మికుల నివాసాలతో సందడి



దివంగత సీఎం వైఎస్సార్ ముందు చూపుతో నిర్మించిన పోర్టు బైపాస్ రోడ్డు పామాయిల్ ఫ్యాక్టరీలకు హబ్‌గా మారింది. పంటపాళెం, ఈపూరు గ్రామాల రూపురేఖలే మారిపోయాయి. పెద్ద సంఖ్యలో కార్మికుల నివాసాలతో సందడిగా మారింది.

– రావి విజయకుమార్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు

సీఎస్సార్ నిధులతో అభివృద్ధి



పామాయిల్ ఫ్యాక్టరీల సామాజిక బాధ్యత కింద పంచాయతీలో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. పాఠశాలల్లో అదనపు గదులు.. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు ఆటో ఖర్చులను సమకూరుస్తున్నారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటుతున్నారు. పేదలు, కార్మికుల కోసం ఆస్పత్రిని నిర్మిస్తే బాగుంటుంది.

– ఆలపాక శ్రీనివాసులు, సర్పంచ్, పంటపాళెం

ఆ రాతలన్నీ అబద్ధాలే..



ఈ చిత్రంలోని మహిళ తవ్వా సావిత్రమ్మ మర్రిపాడు మండలం డీసీపల్లి వాసి. తన భర్త, కుమారులు, కోడళ్లతో కలిసి జీవనోపాధి నిమిత్తం కర్ణాటకలోని మైసూరు సమీపంలోని ఓ గ్రామానికి వలస వెళ్లారు. అయితే వారి కుటుంబానికి సంబంధించిన ఆధార్ కార్డులు, ఆస్తులు, డీసీపల్లిలో ఉన్నాయి. మనవళ్లు, కుటుంబసభ్యులకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాల కోసం తరచూ డీసీపల్లికి ఆమె వచ్చి వెళ్లేవారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా అవసరమైన ధ్రువీకరణ పత్రాలను ఆమె పొందారు.



ఈ ఫొటోలోని వ్యక్తి సుబ్బారావు మనుబోలులో నివాసం ఉంటున్నారు. ఫ్యామిలీ సర్టిఫికెట్ కోసం చాలా కాలంగా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా సర్టిఫికెట్ కోసం అవసరమైన ధ్రువీకరణ పత్రాలను వలంటీర్ ద్వారా అందజేశారు. మనుబోలు పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం నిర్వహించిన కార్యక్రమంలో సర్టిఫికెట్‌ను మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. సర్టిఫికెట్‌ను త్వరగా అందజేయడంపై ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- జగనన్న సురక్షపై ఈనాడు నీచపు రాతలు
- జిల్లాలో కార్యక్రమం విజయవంతం
- 4.37 లక్షలకు గానూ 4.33 లక్షల ధ్రువీకరణ పత్రాల అందజేత

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: సంక్షేమ పథకాల అమల్లో ఏ ఒక్కరూ మిగిలిపోకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న సురక్ష కార్యక్రమంపై ఈనాడు విషం కక్కింది. 'చెప్పింది 11.. ఇస్తోంది 3' అంటూ ప్రతి అక్షరంలో అబద్ధాలు ప్రచురించింది. వాస్తవానికి జగనన్న సురక్ష జిల్లాలో సూపర్‌హిట్ అయింది. ఇప్పటివరకు 615 సచివాలయాల పరిధిలో 4,33,292 ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వలంటీర్లు ప్రధాన పాత్ర పోషించారు. ప్రతి ఇంటికీ వెళ్లి వారికి అవసరమైన ధ్రువీకరణ పత్రాలపై ఆరాతీసి.. దరఖాస్తు చేయించారు. ఫలితంగా ఏళ్ల తరబడి మంజూరు కాని ధ్రువీకరణ పత్రాలు వారం వ్యవధిలో చేతి కందడంతో లబ్ధిదారులు ఆనందంగా ఉన్నారు.

ప్రతి ఇంటికీ వెళ్లి వివరాల ఆరా..

జగనన్న సురక్ష కార్యక్రమాన్ని జూన్ 23న సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ క్రమంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి.. అర్హులై వివిధ కారణాలతో పథకాలు అందని వారు.. సర్టిఫికెట్లు పొందని వారి వివరాలను సేకరిస్తున్నారు. సేవలను రిజిస్టర్ చేసిన వలంటీర్లు వారికి టోకెన్లు ఇచ్చారు. ఆయా సచివాలయాల పరిధిలో క్యాంపులను నిర్వహించి అర్హత ఉన్న వారికి ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్నారు. జిల్లాలోని 769 సచివాలయాల్లో గురువారం నాటికి 615 సచివాలయాల పరిధిలో ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులకు గానూ 4,37,081 సేవలను రిజిస్టర్ చేశారు. ఇందులో 4,33,292 ధ్రువీకరణ పత్రాలను వారం వ్యవధిలో లబ్ధిదారులకు అందజేశారు. సరైన ఆధారాల్లేని కారణంగా ఇప్పటివరకు 3157 దరఖాస్తులను తిరస్కరించగా, మరో 624 దరఖాస్తులు అధికారుల పరిశీలనలో ఉన్నాయి.

సులభతరంగా జారీ

ధ్రువీకరణ పత్రాల కోసం తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ గతంలో రోజుల తరబడి తిరగాల్సి వచ్చేది. అయితే జగనన్న సురక్షలో దరఖాస్తు చేసుకుంటే వారికి కావాల్సిన పత్రాలను క్యాంపుల్లో అందజేస్తున్నారు.

సిఫార్సులకు తావులేదు

గతంలో ధ్రువీకరణ పత్రాలను పొందాలంటే సిఫార్సులు చేయాల్సి ఉండేది. అయితే జగనన్న సురక్ష ద్వారా ఇలాంటి వాటికి తావు లేకుండా ప్రజల చెంతకే అధికారులు వెళ్లి 11 రకాలు సేవలను అందిస్తున్నారు. ఇలాంటి గొప్ప కార్యక్రమంపై ఈనాడు విషం కక్కడంపై నిరసనలు వ్యక్తమవుతున్నాయి.

సేవలు	దరఖాస్తులు	జారీ చేసినవి
ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్స్	2,09,369	2,07,244
ఆదాయ ధ్రువీకరణ పత్రాలు	2,05,457	2,04,653
ఆధార్ సవరణలు	19,141	19,141
ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికెట్	1146	1037
కొత్త రేషన్ కార్డుల మంజూరు	765	489
రేషన్‌కార్డులో చేర్పులు, తొలగింపులు	644	452
మ్యుటేషన్లు	228	11
వివాహమైన వారి వివరాలు		
రేషన్‌కార్డులో తొలగింపు	218	163
మ్యారేజ్ సర్టిఫికెట్లు	64	57
కౌలు రైతుల గుర్తింపు కార్డులు	34	34
జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు	15	11

స్పందన భేష్

జగనన్న సురక్ష కార్యక్రమం జిల్లాలో విజయవంతంగా సాగుతోంది. ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు, సంక్షేమ పథకాల లబ్ధి త్వరితగతిన అందుతున్నాయి. రిజిస్టరైన టోకెన్లను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా రోజువారీ సమీక్ష చేస్తున్నాం. జగనన్న సురక్ష అమల్లో అధికారులు అలసత్వం వహించకుండా వేగవంతంగా మంజూరు చేస్తున్నారు.

– హరినారాయణన్, కలెక్టర్

నేతన్న నేస్తంతో ఆర్థిక భరోసా

- జేసీ కూర్మనాథ్
- 3,966 మంది లబ్ధిదారులకు రూ.9,51,84,000 జమ



నేతన్న నేస్తం పథకం నమూనా చెక్కును అందజేస్తున్న జేసీ కూర్మనాథ్, తదితరులు

నెల్లూరు(దర్గామిట్ట): వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం ద్వారా చేనేతలకు ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పిస్తోందని జాయింట్ కలెక్టర్ ఆర్ కూర్మనాథ్ పేర్కొన్నారు. ఐదో విడత వైఎస్సార్ నేతన్న నేస్తం పథకాన్ని తిరుపతి జిల్లా వెంకటగిరి నుంచి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లాంఛనంగా శుక్రవారం ప్రారంభించారు. కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో నిర్వహించిన జిల్లా స్థాయి కార్యక్రమానికి చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకుడు ఆనంద్‌కుమార్, తొగటవీర క్షత్రియ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆదిలక్ష్మి, జేసీ, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడారు. 2023 – 24 సంవత్సరానికి గానూ జిల్లాలోని 3,966 మంది చేనేత కార్మికులకు రూ.24 వేల చొప్పున రూ.9,51,84,000 మేర వారి ఖాతాలకు జమచేశారని వెల్లడించారు. చేనేత వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న ప్రతి కుటుంబానికి ఏడాదికి రూ.24 వేల చొప్పున ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం అందిస్తోందని చెప్పారు.

సొంతంగా మగ్గం పనులు



వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం ద్వారా ఏటా రూ.24 వేల చొప్పున ఇప్పటి వరకు ఐదు విడతల్లో రూ.1.2 లక్షలను అందజేశారు. ఈ మొత్తంతో సొంతంగా మగ్గం పనులు చేసుకొని జీవిస్తున్నాం. గతంలో ఏదైనా పథకాన్ని పొందాలంటే కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేది. అయితే ప్రస్తుతం సచివాలయ, వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టి ఇంటి వద్దే సంక్షేమ పథకాలను అందిస్తున్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– కొలమల దయాకర్, బుచ్చిరెడ్డిపాళెం

వ్యాపారం మరింత అభివృద్ధి



మా కుటుంబం చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తోంది. వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం ద్వారా ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయంతో వ్యాపారాన్ని మరింత అభివృద్ధి చేసుకుంటున్నాం. ప్రభుత్వ సంక్షేమ పథకాలు మాలాంటి వారికి ఎంతో ఉపయోగపడుతున్నాయి. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు.

– పముజుల లావణ్య, నారాయణరెడ్డిపేట, నెల్లూరు రూరల్

గతంలో ఎవరూ ఇవ్వలేదు



చేనేత కార్మికులను గతంలో ఎవరూ పట్టించుకున్న దాఖలాల్లేవు. చేనేత కార్మికుల పక్షపాతిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారు. వైఎస్సార్ నేతన్న నేస్తం ఆర్థిక భరోసాను కల్పిస్తోంది.

– కవర్తపు రత్నయ్య, కురిచెర్లపాడు, వెంకటాచలం మండలం

ప్రభుత్వ భూమి హాంఫట్



ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమి

- రియల్ ఎస్టేట్ వ్యాపారుల బరితెగింపు

కావలి: రియల్ ఎస్టేట్ వ్యాపారులు బరితెగించి ప్రభుత్వ భూమిని కబ్జా చేశారు. రూ.కోట్ల విలువజేసే భూమిని లేఅవుట్లో కలిపేసుకున్నారు. కావలి పట్టణంలోని తుమ్మలపెంట బీచ్ రోడ్డులో ఆముదాలదిన్నె సర్వే నంబర్ 1848 / 2లో 45 సెంట్ల రహదారి పొరంబోకు భూమి ఉంది. ఈ భూమిని ఆనుకొని ఉన్న ఒకటిన్నర ఎకరా పొలాన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారులు కొనుగోలు చేశారు. పొలాన్ని గ్రావెల్‌తో పరిచి లేఅవుట్ చేశారు. పొలం ముందు భాగంలో ఉన్న ప్రభుత్వానికి చెందిన రోడ్డు పొరంబోకు స్థలమైన 45 సెంట్లనూ అందులో కలిపేసుకున్నారు. రోడ్డును ఆనుకొని ఉన్న ప్లాట్లంటూ జనాలను బురిడీ కొట్టించి అంకణాన్ని రూ.1.2 లక్షలుగా నిర్ణయించి అమ్మకాలు ప్రారంభించారు. రూ.కోట్లు ఆర్జించే అవకాశం ఉన్న ప్రభుత్వ భూమిని కొల్లగొట్టాలనే భారీ స్కెచ్‌తోనే రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఈ వ్యవహారంలోకి దిగారని తెలుస్తోంది. ఈ అంశం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో అక్కడ ప్రభుత్వ భూమి అనే ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. అయితే ఆక్రమణదారులు ఫ్లెక్సీని పీకేసి.. అక్కడ ఆనవాళ్లు లేకుండా చేశారు.

పోలీసులకు ఫిర్యాదు చేస్తాం

ప్రభుత్వ భూమిలో గ్రావెల్‌ను పోసి ఆక్రమణకు పాల్పడిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసి కేసు నమోదు చేయిస్తాం. ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని తొలగించిన వారిపై చర్యలు చేపట్టనున్నాం.

– మాధవరెడ్డి, తహసీల్దార్, కావలి

పొదలకూరు నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	: రూ.25
సన్నవి	: రూ.12
పండ్లు	: రూ.5

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 117
లేయర్ (లైవ్)	: 88
బ్రాయిలర్ చికెన్	: 206
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 230
లేయర్ చికెన్	: 150

అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపాలి



నేర సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న తిరుమలేశ్వరరెడ్డి

- ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): ప్రజాజీవనం, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపాలని ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి ఆదేశించారు. నెల్లూరు నగరంలోని ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్ హాల్లో నెలవారీ నేర సమీక్ష సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. స్టేషన్ల వారీగా పెండింగ్ కేసులు, గ్రేవ్, నాన్‌గ్రేవ్, హత్య, పోక్సో, రేప్, ప్రాపర్టీ, మిస్సింగ్ కేసులు, రోడ్డు ప్రమాదాలు, తదితరాలపై సమీక్షించిన అనంతరం ఆయన మాట్లాడారు. రౌడీలు, సస్పెక్ట్ లు, పాతనేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలని, తమదైన శైలిలో తరచూ కౌన్సెలింగ్‌ను నిర్వహించి, వారిలో పరివర్తనకు కృషి చేయాలని సూచించారు. యాసిడ్, బాణసంచా తయారీ, నిల్వ కేంద్రాలపై తనిఖీలను నిరంతరం నిర్వ హించాలని, ప్రభుత్వ అనుమతుల్లేని, నిబంధనలు పాటించని వాటిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. సాంకేతిక పరిజ్ఞానం, వృత్తి నైపుణ్యాన్ని ఉపయోగించి దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు కోర్టులో చార్జిషీట్‌ను దాఖలు చేయాలని చెప్పారు. ప్రత్యేక బృందాలతో చోరీ కేసులను ఛేదించి నిందితులను అరెస్ట్ చేసి సొత్తు ను రికవరీ చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేట్టాలన్నా రు. పేకాట, కోడిపందేలు, అసాంఘిక కార్యకలాపాలపై దాడులను ముమ్మరం చేయాలని పేర్కొన్నారు. గంజాయి విక్రయాలు, రవాణా, సేవనంపై ఉక్కుపా దం మోపాలని కోరారు. సైబర్ నేరాలు, దిశ యాప్, ఎల్‌హెచ్‌ఎమ్మెస్, 14500, 1930పై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహించినా.. అవినీతి, అక్రమాలకు పాల్పడినా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అనంతరం గత నెల్లో ప్రతిభ కనబర్చిన అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలను అందజేశారు. ఏఎస్పీలు హిమవతి, ప్రసాద్, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి ప్రభుత్వ ప్రోత్సాహం



మాట్లాడుతున్న నిరంజన్‌బాబురెడ్డి

నెల్లూరు (దర్గామిట్ట): రాష్ట్రంలో వ్యవసాయాభివృద్ధికి ప్రభుత్వం తగిన ప్రోత్సాహాన్ని అందిస్తోందని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి పేర్కొన్నారు. కలెక్టరేట్లోని శంకరన్ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు సబ్సిడీతో వ్యక్తిగత వ్యవసాయ పరికరాలు, జింక్, జిప్సమ్‌ను ప్రభుత్వం సరఫరా చేస్తోందని చెప్పారు. అనంతరం పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు మాట్లాడారు. 2021, 22కు సంబంధించిన ధాన్యం కొనుగోలు విషయంలో 641 మంది రైతులకు రూ.32,55,453 రవాణా చార్జీలను చెల్లించామని, 830 మంది రైతుల క్లెయిమ్‌లకు సంబంధించిన రూ.48,36,205 మొత్తం డీఎం కార్యాలయంలో ప్రాసెస్‌లో ఉందని చెప్పారు. డీఆర్వో నారాయణమ్మ, జిల్లా వ్యవసాయాధికారి సుధాకర్‌రాజు, జిల్లా ఉద్యానాధికారి సుబ్బారెడ్డి, రాష్ట్రస్థాయి వ్యవసాయ సలహా మండలి సభ్యులు కృష్ణారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, నాబార్డు డీడీఎం రవిసింగ్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సై నిర్బంధించారంటూ ఎస్పీకి ఫిర్యాదు

నెల్లూరు(క్రైమ్): ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో ఓ మహిళా ఎస్సై తనను నిర్బంధించి ఇబ్బందులకు గురిచేశారని ఆరోపిస్తూ ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డికి నగరానికి చెందిన ఓ మహిళ ఫిర్యాదు చేశారని విశ్వసనీయ సమాచారం. వివరాలు.. నెల్లూరులోని తెలుగుగంగ కాలనీకి చెందిన ఓ మహిళా వడ్డీ వ్యాపారికి పోలీస్ శాఖలో పనిచేస్తున్న పలువురితో పరిచయాలున్నాయి. ఈ క్రమంలో పలువురు ఎస్సైలు, సిబ్బంది పెద్ద మొత్తంలో నగదును ఆమె ద్వారా వడ్డీలకు తిప్పుతున్నారని సమాచారం. సదరు మహిళ రూ.కోట్లలో వడ్డీ వ్యాపారం చేస్తున్నారు. అయితే కొన్ని రోజులుగా ఎవరికీ కనిపించకుండా ఆమె తిరుగుతుండటంతో వడ్డీలకు నగదును తిప్పుతున్న వారు గాలింపు చర్యలు చేపట్టారని తెలిసింది. ఈ క్రమంలో సదరు మహిళా వడ్డీ వ్యాపారి ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్ హాల్ వద్ద శుక్రవారం ప్రత్యక్షమయ్యారు. దిశ మహిళా పోలీస్‌స్టేషన్లో పనిచేస్తూ ప్రస్తుతం సెలవులో ఉన్న ఓ మహిళా ఎస్సై నగదు కోసం తనను నిర్బంధించారని, ఆమె నుంచి తప్పించుకొచ్చానని ఆరోపిస్తూ అక్కడి పోలీస్ అధికారుల ద్వారా ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. కాగా విచారణ జరిపి నివేదికను అందజేయాలని దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్‌ను ఎస్పీ ఆదేశించారు. దీంతో మహిళ వద్ద స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేయడంతో పాటు సదరు మహిళా ఎస్సైను విచారిస్తున్నారని సమాచారం.

21.07.2023 ఇండియన్ బ్యాంకు, నెల్లూరు వారి వేలం ప్రకటనకు ఖండన ప్రకటన

తేది 21.07.2023 న సాక్షి దినపత్రిక నెల్లూరు మరియు తిరుపతి జిల్లాల ఎడిషన్‌లలో శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, నెల్లూరు నగరం, ట్రంకురోడ్డు, గాంధీబొమ్మ, విశ్వనాథ షాపింగ్ కాంప్లెక్స్‌లోని ఇండియన్ బ్యాంక్ మెయిన్ బ్రాంచి వారు ప్రకటించిన స్థిరాస్తి విక్రయ ప్రకటనను ఖండించుట గురించి. ప్రకటించిన ఇ-వేలం అమ్మకం నందు కనపరచిన విషయం గురించి.

పైన తెలిపిన ప్రకటనకు సంబంధించిన నెల్లూరు, ఇండియన్ బ్యాంక్, మెయిన్ బ్రాంచి వారు తేది.01.06.2022 దిన జారీ చేసిన నోటీసు ఈ క్రింద తెలియపరిచిన స్థిరాస్తి అయిన శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా, నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్ బిట్-2, స్టోన్‌హౌస్ పేట, లక్ష్మీపురంలోని విజయభేరి హోమ్స్, పాత డోర్ నెం.270/3, క్రొత్త డోర్ నెం: 3/298, వార్డు నెం : 8, పాత అసెస్‌మెంట్ నెం : 2103, క్రొత్త అసెస్‌మెంట్ నెం : 2788/4400, 720 చదరపు గజములు విస్తీర్ణంలోని 3.46 అంకణములు లేదా 27.68 చదరపు అడుగులు (అవిభాజ్యమైన వాటా) విస్తీర్ణము నందు ప్లింత్ ఏరియా 1239 చదరపు అడుగులలోని నివాసయోగ్యమైన ఫ్లాట్ 5వ అంతస్తు నందు ఫ్లాట్ నెం.5బి తో వున్నది. ఈ అపార్ట్‌మెంట్ హద్దులు : తూర్పు : కామన్ కారిడార్, దక్షిణం: ఓపెన్ టు స్కై, పడమర : ఓపెన్ టు స్కై, ఉత్తరం: ఓపెన్ టు స్కై పై తెలిపిన అపార్ట్‌మెంట్‌లోని ఫ్లాట్ పి.నాగరాజు S/o (లేట్) పి.ఆదిశేషయ్య గారికి హక్కు కలిగినది.

తేది. 08.09.2022న హౌస్ లోన్ అకౌంట్ నెం : 646340688 కు బకాయికి సంబంధించి Possession Notice కు తే.14.09.2022దిన ఓవర్ డ్యూ రూ.96,000/- లు కట్టి పైన తెలుపబడిన ఆస్తికి సంబంధించి మీరు ఇచ్చిన స్వాధీన నోటీసును రద్దు చేయమని వ్రాతపూర్వకంగా కోరియున్నాను. అప్పటి నుండి ఇప్పటివరకు కూడా నాకు ఎటువంటి నోటీసు ఇవ్వకుండా తే.21.07.2023దిన సాక్షి దినపత్రికలో నా స్థిరాస్తిని వేలం వేస్తున్నట్లుగా Indian Bank ప్రకటన ఇచ్చియున్నారు. ఈ విషయం గురించి గౌ॥ VIII వ అడిషనల్ జిల్లా జడ్జి, నెల్లూరు వారి కోర్టులో దావా వేసియున్నందున వారి విచారణలో వున్నందున పై స్థిరాస్తిని ఇ-వేలంలో పాల్గొని కొనుగోలు చేసిన యెడల ఈ స్థిరాస్తిని స్వాధీనపరచబడదు మరియు శిక్షార్హులుగా పరిగణించబడుదురు అని తెలియచేయడమైనది.

వై.వి. శేషయ్య,
న్యాయవాది, నెల్లూరు. సెల్: 90306 22216.

21.07.2023 ఇండియన్ బ్యాంకు, నెల్లూరు వారి వేలం ప్రకటనకు ఖండన ప్రకటన

తేది. 21.07.2023 వ సాక్షి దినపత్రిక, నెల్లూరు మరియు తిరుపతి జిల్లాల ఎడిషన్‌లలో శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, నెల్లూరు నగరం, ట్రంకు రోడ్డు, గాంధీ బొమ్మ, విశ్వనాథ షాపింగ్ కాంప్లెక్స్‌లోని ఇండియన్ బ్యాంక్ మెయిన్ బ్రాంచి వారు ప్రకటించిన స్థిరాస్తి విక్రయ ప్రకటనను ఖండించుట గురించి, ప్రకటించిన ఇ-వేలం అమ్మకం నందు కనపరచిన మరియు దాచిన కేసుల వివరములు.

ఆస్థి నెం : 1 కు సంబంధించిన వివరములు : ఐటం నెం – 1: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, కోవూరు మండలం, పోతిరెడ్డిపాలెం గ్రామం & పంచాయితీలోని పట్టా నెం : 114, పాత సర్వే నెం : 86/ఎ1, 86/ఎ2, క్రొత్త సర్వే నెం : 196, పట్టాదారు పాసుబుక్ ప్రకారం "శ్రీ రామేశ్వరి రా & బాయిల్డ్ రైస్‌మిల్" ప్రొ॥ పి.నాగరాజు తండ్రి ఆదిశేషయ్యకు చెందిన రైస్ మిల్లు మరియు స్థలము వివాదంలో ఉండి, గౌ॥ నెల్లూరు VIII వ అడిషనల్ జిల్లా జడ్జి వారి కోర్టులో కేసులు నెం : (1) ఒ.యస్.నెం. 68/2022, (2) ఐ.ఎ.నెం: 77/2002, (3) ఐ.ఎ.నెం : 78/2002. ఈ మూడు కేసులు పైన తెలిపిన స్థిరాస్తి తాలూకు కేసులు దాఖలు పరిచి వారి పరిధిలో విచారణలో ఉన్న కారణంగా ఈ స్థిరాస్తిని ఎవ్వరూ కొనుగోలు చేయుటకు ఎటువంటి హక్కు లేదు. ఒక వేళ ఇ-వేలంలో పాల్గొని కొనుగోలు చేసిన యెడల ఈ స్థిరాస్తిని స్వాధీనపరచ బడదు, మరియు శిక్షార్హులుగా పరిగణించబడుదురు. పైన తెలిపిన స్థిరాస్తికి హద్దులు :- తూర్పు : అడుసుమల్లి లక్ష్మీకాంతమ్మ గారి భూమి, దక్షిణం : ఇరిగేషన్ ఛానల్, పడమర : మన్నారుపు కృష్ణమ్మ మరియు ఇతరులకు చెందిన భూమి, ఉత్తరం : అడుసుమల్లి లక్ష్మీకాంతమ్మ గారి భూమి. పై తెలిపిన విస్తీర్ణం య. 1.55సెంట్లు లో య. 0.50సెంట్లు.

ఐటమ్ నెం-2: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, కోవూరు మండలం, పోతిరెడ్డిపాలెం గ్రామం & పంచాయితీలోని పట్టా నెం : 114, పాత సర్వే నెం : 86/ఎ1, 86/ఎ2, క్రొత్త సర్వే నెం : 196, పట్టాదారు పాసుబుక్ ప్రకారం " శ్రీ రామేశ్వరి రా & బాయిల్డ్ రైస్‌మిల్" ప్రొ॥ పి.నాగరాజు తండ్రి ఆదిశేషయ్యకు చెందిన రైస్ మిల్లు మరియు స్థలము వివాదంలో ఉండి, గౌ॥ నెల్లూరు VIII వ అడిషనల్ జిల్లా జడ్జి వారి కోర్టులో కేసులు నెం: (1) ఒ.యస్.నెం.68/2022, (2) ఐ.ఎ.నెం: 77/2002, (3) ఐ.ఎ.నెం:78/2002 ఈ మూడు కేసులు పైన తెలిపిన స్థిరాస్తి తాలూకు కేసులు దాఖలు పరిచి వారి పరిధిలో విచారణలో ఉన్న కారణంగా ఈ స్థిరాస్తిని ఎవ్వరూ కొనుగోలు చేయుటకు ఎటువంటి హక్కు లేదు. ఒకవేళ ఇ-వేలంలో పాల్గొని కొనుగోలు చేసిన యెడల ఈ స్థిరాస్తిని స్వాధీనపరచబడదు, మరియు శిక్షార్హులుగా పరిగణించబడుదురు. పైన తెలిపిన స్థిరాస్తికి చెందిన విస్తీర్ణం య. 1.05సెంట్లు లోని య. 0.25 సెంట్లు భూమికి హద్దులు :- తూర్పు : పచ్చబొట్లు నాగరాజుకు చెందిన భూమి, దక్షిణం : ఇరిగేషన్ ఛానల్, పడమర : మన్నారు కృష్ణమ్మ మరియు ఇతరులకు చెందిన భూమి, ఉత్తరం : అడుసుమల్లి లక్ష్మీకాంతమ్మకు చెందిన భూమి, య. 0.50 సెంట్లు మరియు య. 0.25ట్లు వెరశి య. 0.75సెంట్లు భూమి.

ఆస్థి నెం : 2 వివరములు : శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్ బిట్-2, స్టోన్‌హౌస్ పేట, లక్ష్మీపురంలోని విజయభేరి హోమ్స్, పాత డోర్ నెం. 270/3, క్రొత్త డోర్ నెం: 3/298, వార్డు నెం: 8, పాత అసెస్‌మెంట్ నెం : 2103, క్రొత్త అసెస్‌మెంట్ నెం : 2788/4400, 720 చదరపు గజములు విస్తీర్ణంలోని 3.46 అంకణములు లేదా 27.68 చదరపు అడుగులు (అవిభాజ్యమైన వాటా) విస్తీర్ణము నందు ప్లింత్ ఏరియా 1239 చదరపు అడుగులలోని నివాసయోగ్యమైన ఫ్లాట్ 5వ అంతస్తు నందు ఫ్లాట్ నెం. 5బి తో వున్నది. ఈ అపార్ట్‌మెంట్‌కు హద్దులు: తూర్పు: కామన్ కారిడార్ దక్షిణం : ఓపెన్ టు స్కై, పడమర: ఓపెన్ టు స్కై, ఉత్తరం: ఓపెన్ టు స్కై పై తెలిపిన అపార్ట్‌మెంట్‌లోని [illegible]

వై.వి. శేషయ్య,
న్యాయవాది, నెల్లూరు. సెల్: 90306 22216.




ఈ ఆహారం తింటే...

చినుకుల్లోనూ చింత ఉండదిక

నిన్న మొన్నటి దాకా చెమటలు పట్టించిన ఎండలు కాస్తా ఇప్పుడు మబ్బుల వెనక దాక్కుని, వానలు కురిపిస్తున్నాయి. వానలు ఆహ్లాదంగానే ఉంటాయి. అయితే సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే వ్యాధులను కూడా వెంట మోసుకొస్తాయి. ఈ అనారోగ్యాలతో పోరాడటానికి. రోగనిరోధకశక్తి బలంగా ఉండటం చాలా ముఖ్యం. వర్షాకాలంలో వ్యాధి నిరోధక శక్తిని మరింత పెంచుకోవడానికి నిత్యం తీసుకునే ఆహారంలో కొన్ని మార్పులు చేసుకోవడం అవసరం. ఆ మార్పులేమిటో, ఈ సీజన్‌లో ఏ ఆహారం తీసుకుంటే మంచిదో చూద్దాం...



ముసురు పట్టినప్పుడు వేడి వేడి టీ, కాఫీలు తాగుతుంటారు. అయితే వాటికి బదులు గ్రీన్ టీ, బ్లాక్ టీ, హెర్బల్ టీ వంటివి తీసుకోవాలి. దాంతోపాటు అల్లం, మిరియాలు, తేనెతో తయారు చేసిన టీ సేవిస్తే.. ఆరోగ్యానికి చాలా మంచిది. అదేవిధంగా బజ్జీలు, పునుగులు, బోండాలకు బదులు వేడి వేడి ఉగ్గాణి, సెనగ, పెసర గుగ్గిళ్లు, చుడువా, సగ్గుబియ్యం కిచిడీ మంచిది. పుదీనా, తులసి ఆకుల్లో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్ గుణాలు అధికంగా ఉంటాయి కాబట్టి వీటితో కషాయం కాచుకుని తాగితే మంచిది. రాగులు, సోయాబీన్స్, పెసలు, మొక్కజొన్న వంటి పప్పుధాన్యాలను ఆహారంలో భాగంగా చేసుకుంటే ఎలాంటి అనారోగ్య సమస్యలూ దరిచేరవు. వీటితోపాటు పోషక విలువలు ఎక్కువగా ఉండే కూరగాయలు, పండ్లు అంటే దానిమ్మ, ఆపిల్, స్ట్రాబెర్రీ, అరటి, క్యాబేజీ, క్యాలీఫ్లవర్, బచ్చలి కూర వంటివి తీసుకుంటే మంచిది.



అల్లం: ఇది శరీర కణజాలాలకు పోషకాలను సమీకరించడానికి, సరఫరా చేయడానికి తోడ్పడుతుంది. ఈ రోజుల్లో జలుబు, దగ్గు వంటి సమస్యలు సర్వసాధారణం. అల్లం కఫాన్ని తగ్గిస్తుంది కాబట్టి అల్లం టీ తాగితే జలుబు, దగ్గు దూరం అవుతాయి. ఫ్లూతో పోరాడటానికి అల్లం తోడ్పడుతుంది. అల్లంలోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు రోగనిరోధక శక్తినీ మెరుగుపరుస్తాయి. టీలు, సూప్‌లు, కూరల్లో అల్లాన్ని ఎక్కువ ఉపయోగిస్తే వ్యాధి నిరోధకతను పెంచుకోవచ్చు.



నేరేడు పండు... ఈ పండులో ఉండే విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు, ఖనిజాలూ ఫైటోకెమికల్స్తూ రోగనిరోధక శక్తిని మెరుగుపరుస్తాయి. నేరేడులో క్యాలరీలు తక్కువ. వానాకాలంలో వచ్చే అతిసార, కలరా వ్యాధులతో పాటు ఇతరత్రా ఇన్ఫెక్షన్లకీ నేరేడు ఔషధంలా పనిచేస్తుంది.

తులసి... ఈ కాలంలో రోజూ తులసి ఆకులను నమలడం ద్వారా అనారోగ్యాల నుంచి రక్షణ పొందవచ్చు. ఐదు తులసి ఆకులను రాత్రంతా నీటిలో నానబెట్టి.. మరుసటి రోజు ఉదయం పరగడుపునే ఆ ఆకులు తిని.. నీటిని తాగాలి. తులసి రోగనిరోధక వ్యవస్థను బూస్ట్ చేస్తుంది.



నిమ్మ... నిమ్మరసంలో విటమిన్ సి సమృద్ధిగా ఉంటుంది. ఇది శక్తిమంతమైన యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేసి రోగనిరోధక శక్తిని పెంపొందిస్తుంది. అంతేకాదు, శరీరంలో తెల్ల రక్త కణాల ఉత్పత్తిని పెంచుతుంది. ఇది ఇన్ఫెక్షన్లు, అంటువ్యాధుల నుంచి శరీరాన్ని రక్షిస్తుంది.

మిరియాలు... నల్ల మిరియాలలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడంలో సహాయపడతాయి. జీవక్రియలను పెంచుతాయి. దగ్గు, గొంతు నొప్పి ఉన్నట్లయితే నల్ల మిరియాలను పొడి చేసి నిద్రవేళకు ముందు వేడి పాలలో కలుపుకొని తాగితే ఆరోగ్యానికి చాలా మంచిది.



పసుపు... పసుపులో యాంటీ బాక్టీరియల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరాన్ని అనేక వ్యాధుల నుంచి రక్షించడంలో సహాయపడతాయి. రోజూ రాత్రిపూట చిటికడు పసుపు కలిపిన వేడి పాలు తాగితే రోగనిరోధక శక్తి పెరుగుతుంది.

వీటికి దూరంగా ఉండటం మేలు!

రోగనిరోధక శక్తిని బలోపేతం చేయాలంటే చక్కెర పదార్థాలకి దూరంగా ఉండాలి. ముఖ్యంగా ఐస్ క్రీం, కేక్, క్యాండీ, చాక్లెట్, కూల్‌డ్రింక్స్ తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి తగ్గుతుంది. అలాగే ఉప్పు ఎక్కువగా ఉండే ఆహారాలు ఆరోగ్యానికి చాలా హాని కలిగిస్తాయి. రోగనిరోధక శక్తిని బలహీనపరుస్తాయి. చాలామంది ప్యాక్ చేసిన ఆహారాలని తినడానికి ఎక్కువగా ఇష్టపడుతారు. కానీ ఇవి ఆరోగ్యానికి మంచివి కావు. అధిక ఉప్పు ఆటో ఇమ్యూన్ వ్యాధి ప్రమాదాన్ని పెంచుతుంది. అలాగే ఆల్కహాల్, ధూమపానం కూడా శరీరాన్ని బలహీనంగా మారుస్తాయి. అందుకే వీటికి వీలైనంత దూరంగా ఉంటే మేలు.



దాల్చిన చెక్క... అద్భుత ఔషధ గుణాలెన్నో దాగి ఉన్న దాల్చిన చెక్క మధుమేహులకు రక్తంలో చక్కెర శాతాన్ని తగ్గిస్తుంది. రోజూ గ్లాసు పాలలో దాల్చిన చెక్క పొడి కలుపుకొని తాగితే రోగనిరోధక శక్తి పెరుగుతుంది. అంతేకాదు, శరీరంలో ఉండే కొవ్వు శాతాన్ని తగ్గించే గుణం దీనిలో ఇమిడి ఉంది.



లవంగం... ఇది రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడానికి పనిచేస్తుంది. వర్షాకాలంలో లవంగాలను తీసుకుంటే గొంతు నొప్పి వంటి సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చు.



బడికి వెళ్లనని మారాం చేస్తున్నారా?

ఉదయాన్నే పిల్లల్ని తయారు చేసి స్కూలుకు పంపించడం పేరెంట్స్‌కు పెద్దపని. ఇంతకంటే వాళ్లను నిద్రలేపడం అతిపెద్ద టాస్క్. ఎంత లేపినా నిద్ర లేవరు. కింద స్కూల్ ఆటోనో, బస్సో వచ్చి హారన్ కొడుతుంటుంది. కానీ వీళ్లు లేవరు. వీళ్లను తొందరగా నిద్ర లేపాలంటే ఇలా ప్రయత్నించి చూడండి....

సమస్యను అర్థం చేసుకోవాలి

ముందుగా నిద్ర లేవడానికి ఏమైనా ఇబ్బంది పడుతున్నారేమో గమనించాలి. రాత్రి సరిగా పడుకున్నారా లేదా... అసలు నిద్రపట్టలేదా... ఇంకేదైనా సమస్య ఉంటే అనునయంగా అడిగి తెలుసుకోవాలి.

సరిపోయిందా లేదా?

స్కూలుకెళ్లే పిల్లలు కనీసం పదిగంటలు నిద్రపోవాలి. గేమ్స్, ఫోన్లు చూస్తూ సరిగా పడుకోరు. రోజూ ఒక నిర్దేశిత సమయాన్ని కేటాయించి వాళ్లు కచ్చితంగా పడుకునేలా చేయాలి.

ప్రేమతో లేపాలి

ఉదయం ఎంత ఉత్సాహంగా లేస్తే రోజంతా అలానే గడుస్తుంది. అందుకే పిల్లలు త్వరగా లేవకపోయినా ప్రేమగా నిద్రలేపాలి. పిల్లలకు అర్థమయ్యే ప్రేమ భాషలోనే నిద్ర లేపాలి. ఇందుకోసం వాళ్లకు నచ్చే మంచి విషయాలు, స్కూలుకు వెళ్లడం ఎంతముఖ్యమో ప్రేమతో చెప్పాలి.

ఇష్టమైన ఫుడ్

పిల్లలు ఇష్టంగా తినే ఆహారాన్ని బ్రేక్‌ఫాస్ట్‌లో ఇవ్వాలి. అది తినడం కోసం అయినా త్వరగా నిద్ర లేస్తారు. ఈ నాలుగు చిట్కాలు ప్రయత్నిస్తే మీ సమస్య తీరినట్టే.

దిండు లేకుండా పడుకోలేరా?

రాత్రిపూట నిద్రించేటప్పుడు చాలా మంది తలకింద దిండు పెట్టుకొని పడుకుంటారు. అయితే తక్కువ ఎత్తు ఉన్న దిండు ఫరవాలేదు కానీ, పెద్ద దిండు పెట్టుకోవడం వల్ల చాలా ఆరోగ్య సమస్యలు ఏర్పడుతాయి. ఇది మొదట్లో తెలియదు కానీ కొన్ని రోజులు గడిచిన తర్వాత ముందుగా మెడ నొప్పి ఎదురవుతుంది. ఈ నొప్పి దీర్ఘకాలికంగా వేధిస్తుంది. కొంతమందికి ఉదయం నిద్రలేవగానే వెన్నులో నొప్పితో బాధపడతారు. మీకు ఇలాంటి సమస్య ఎదురైతే పడుకునేటప్పుడు మీరు ఎత్తయిన దిండు ఉపయోగిస్తున్నట్లు లెక్క. దీనివల్ల వెన్నెముక వంగిపోతుంది. డిస్కులలో దూరం పెరిగి వెన్నునొప్పి వస్తుంది. అందువల్ల దిండు లేకుండా నిద్రించడం అలవాటు చేసుకోవాలి.



తలలో రక్త ప్రసరణ జరగదు: ఎత్తయిన దిండు పెట్టుకొని నిద్రపోతే తలకి రక్త సరఫరా సరిగ్గా జరగదు. రాత్రిపూట చాలా గంటలు ఇలాగే ఉండటం వల్ల రక్త సరఫరా లేక జుట్టుకు సరైన పోషణ లభించదు. దీనివల్ల జుట్టు రాలే సమస్య మొదలవుతుంది. అంతేకాదు, తరచు తలనొప్పి వస్తుంది. లావుపాటి దిండు పెట్టుకొని నిద్రించడం వల్ల శరీరంలోని కొన్ని భాగాలకి రక్త సరఫరా సరిగ్గా అందక తిమ్మిర్ల సమస్యలు ఏర్పడుతాయి. అందువల్ల మెడనొప్పి ఉండకూడదంటే తక్కువ ఎత్తు ఉండే చిన్న దిండుని ఉపయోగించాలి లేదంటే మెత్తటి టవల్ లేదా పలుచటి దుప్పటిని మడత పెట్టి తలకింద పెట్టుకోవడం ఉత్తమం.

హెల్త్ టిప్స్

మందారం ఆకుల్ని నూరి షాంపూగా వాడితే జుత్తు బాగా పెరుగుతుంది. చుండ్రు నివారణలోనూ, తెల్ల వెంట్రుకల నిరోధకంలోనూ సాయమవుతుంది. కప్పు నీటిలో ఒక మందార పువ్వు వేసి మరిగించి ఆ నీళ్లను తాగితే రక్తంలో ఐరన్ పెరుగుతుంది.

కరివేపాకులో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఓ 10 ఆకులతో పేస్ట్ తయారు చేసి మజ్జిగలో కలిపేసుకుని రోజూ తాగితే కాలేయం వ్యర్థపదార్థాల నుంచి రక్షణ పొందుతుంది. రోజూ ఓ 8 ఆకుల్ని మిరియాలతో కలిపి తింటే ముక్కులో వచ్చే అలర్జీలు తగ్గిపోతాయి.

రోజూ రెండు మూడు పుదీనా ఆకుల్ని నమిలి మింగుతుంటే జీర్ణశక్తి పెరిగి, కడుపు ఉబ్బరం, తేన్పులు తగ్గుతాయి. శ్వాసకోశాల శక్తి పెరుగుతుంది.

వేపాకు, యాంటీ సెప్టిక్‌గానూ, క్రిమి సంహారిణిగానూ బాగా పనిచేస్తుంది. వేపాకు పొడిని నీళ్లల్లో కలిపి చల్లితే ఎన్నో రకాల క్రిమి కీటకాలు దూరంగా వెళ్లిపోతాయి. వేపాకుల్ని నీటిలో వేసి మరిగించి స్ప్రే చేస్తే దోమల బెడద తప్పుతుంది. వేపాకు పొడిని పేస్ట్‌గా చేసి వాడితే పలు రకాల చర్మ సమస్యలు, మొటిమలు, ఎగ్జిమాల బాధలు తప్పుతాయి.

పసుపును పేస్ట్‌గా రోజూ ముఖానికి వాడితే, ముఖం మీద ఉండే సన్నని వెంట్రుకలు రాలిపోతాయి. అలాగే మొటిమలు, మచ్చలు కూడా మాయమవుతాయి. ఇది గొప్ప యాంటీ ఆక్సిడెంటు కాబట్టి రోజు మొత్తంలో ఒక టీ స్పూను దాకా కడుపులోకి తీసుకోవచ్చు.

సినిమా



● ప్రభాస్

అంతం ఆరంభమవుతుంది!

వెండితెరపై ప్రభాస్ కల్కి అవతారం ఎత్తారు. ప్రభాస్, కమల్‌హాసన్, అమితాబ్ బచ్చన్, దీపికా పదుకోన్, దిశా పటానీ ముఖ్య తారలుగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో 'ప్రాజెక్ట్ కె' వర్కింగ్ టైటిల్‌తో ఓ సైన్స్ ఫిక్షన్ ఫిల్మ్ రూపొందుతున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం అమెరికాలో జరుగుతున్న 'శాన్ డియాగో కామిక్ కాన్ – 2023' వేడుకలో ఈ సినిమాకు 'కల్కి 2898 ఏడీ' టైటిల్‌ను ఖరారు చేసినట్లు శుక్రవారం వెల్లడించి, గ్లింప్స్ వీడియోను రిలీజ్ చేశారు. 'ప్రపంచాన్ని చీకటి కమ్మేసినప్పుడు ఒక శక్తి ఉద్భవిస్తుంది. అప్పుడు అంతం ఆరంభం అవుతుంది' అన్నట్లుగా ఈ వీడియోలో ఉంది. ఈ వేడుకలో కమల్‌హాసన్ మాట్లాడుతూ– ''మేం స్టోరీలు చేస్తుంటే వారు (ఆడియన్స్) మమ్మల్ని స్టార్స్ చేస్తున్నారు. 'కల్కి 2898 ఏడీ'లో పెద్ద విజన్ ఉంది. ఈ సినిమాలో భాగం కావడం గౌరవంగా ఉంది'' అన్నారు. ''ఈ సినిమాలో నాగ్ అశ్విన్ నా క్యారెక్టర్‌ను డిజైన్ చేసిన తీరు బాగా నచ్చింది. సినిమాలో స్ట్రాంగ్ ఎమోషన్స్ ఉన్నాయి'' అన్నారు ప్రభాస్. ''ఈ సినిమా నాకో అద్భుతమైన అనుభవం. దీని వెనక గొప్ప పరిశోధన ఉంది'' అని వర్చ్యువల్‌గా అమితాబ్ బచ్చన్ మాట్లాడారు. ''నేను సైన్స్ ఫిక్షన్, పురాణాలను ఇష్టపడతాను. మహాభారతం, స్టార్ వార్స్... రెండింటినీ చూస్తూ, వింటూ పెరిగాను. ఈ రెండు ప్రపంచాలను కలిపే ఒక గొప్ప సినిమా చేయాలనుకున్నప్పుడు 'కల్కి 2898 ఏడీ' పుట్టింది'' అన్నారు నాగ్ అశ్విన్. ''ఈ సినిమా మాకు గర్వకారణం'' అన్నారు నిర్మాత అశ్వనీదత్. ఈ వేడుకలో రానా, ప్రియాంకా దత్, స్వప్నా దత్ పాల్గొన్నారు. 'కల్కి 2898 ఏడీ'ను 2024 జనవరి 12న రిలీజ్ చేయాలనుకుంటున్నారు.

రామ్‌చరణ్‌తో కలిసి నటిస్తా: ప్రభాస్

రామ్‌చరణ్‌తో కలిసి నటిస్తానని ప్రభాస్ 'కామిక్ కాన్–2023' వేడుకల్లో చెప్పారు. ఈ వేడుకల్లో 'ఆర్ఆర్ఆర్' సినిమా ప్రస్తావన రాగా... ''భారతదేశంలో ఉన్న అద్భుతమైన దర్శకుల్లో రాజమౌళి గారు ఒకరు. 'ఆర్ఆర్ఆర్' సినిమాలోని పాటకు ఆస్కార్ రావడం నాకు చాలా సంతోషంగా అనిపించింది. అది దేశ ప్రజలందరికీ దక్కిన గౌరవంగా భావించాం. అలాగే రామ్‌చరణ్ నాకు మంచి మిత్రుడు. ఏదో ఒక రోజు మేం కచ్చితంగా కలిసి సినిమా చేస్తాం'' అని చెప్పుకొచ్చారు ప్రభాస్.



● చిరంజీవి, తమన్నా

మిల్కీ బ్యూటీ... నువ్వే నా స్వీటీ

'అచ్చ తెలుగు పచ్చి మిర్చి మగాడు వీడే.. బొంబాటు ఘాటు హాటు హాటుగున్నాడే.. కల్లోకి వచ్చేసి కన్నెగుండెల్లో సూది గుచ్చి పిల్లా నీ ముచ్చటేంది అన్నాడే...' అంటూ రొమాంటిక్ మోడ్‌లోకి వెళ్లిపోయారు హీరోయిన్ తమన్నా. చిరంజీవి టైటిల్ రోల్‌లో నటించిన తాజా చిత్రం 'భోళా శంకర్'. ఈ చిత్రంలో చిరంజీవి సరసన తమన్నా నటించగా, ఆయన చెల్లెలి పాత్రలో కీర్తీ సురేష్ నటించారు. మెహర్ రమేష్ దర్శకత్వంలో అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 11న విడుదల కానుంది. ఈ చిత్రంలోని 'మిల్కీ బ్యూటీ.. నువ్వే నా స్వీటీ..' అంటూ సాగే పాట లిరికల్ వీడియోను శుక్రవారం విడుదల చేశారు. రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించిన ఈ పాటను విజయ్ ప్రకాష్, సంజన కల్మంజేతో కలసి ఈ చిత్ర సంగీతదర్శకుడు మహతి స్వర సాగర్ ఆలపించారు.



● సుదీప్, అమలాపాల్

యాక్షన్ హెబ్బులి

సుదీప్, అమలా పాల్ జంటగా ఎస్. కృష్ణ దర్శకత్వంలో రూపొందిన కన్నడ రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ 'హెబ్బులి'. ఈ సినిమాను అదే టైటిల్‌తో సి. సుబ్రహ్మణ్యం ఆగస్టు 4న తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ– ''ఫ్యామిలీ ఎమోషన్స్, యాక్షన్, రొమాంటిక్ సీన్స్ మిళితమై ఉన్న పక్కా కమర్షియల్ ఫిల్మ్ 'హెబ్బులి'. కన్నడంలో రూ. 100 కోట్లు సాధించింది. తెలుగులోనూ హిట్ అవుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు.



● వైష్ణవ్ తేజ్



● మహేశ్‌బాబు



● టొవినో థామస్

కిక్... పంచ్...

విలన్ ముఖం మీద హీరో పంచ్ ఇవ్వాలా? కాలితో ఒక్క కిక్ కొట్టాలా? గాల్లో ఎగిరి పల్టీలు కొట్టి మరీ విలన్‌ని కొట్టాలా? ఇవన్నీ చేయాలంటే కాస్త ట్రైనింగ్ కావాలి. రెగ్యులర్ ఫైట్స్‌కి అయితే అక్కర్లేదు. బీభత్సమైన ఫైట్స్‌కి అయితే శిక్షణ తీసుకోవాల్సిందే. అది హీరో అయినా హీరోయిన్ అయినా. ఈ మధ్య రిస్కీ రోల్స్ ఒప్పుకున్న కొందరు స్టార్స్ 'మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్' నేర్చుకోవడానికి ప్రిపేర్ అయ్యారు. కిక్ బాక్సింగ్, కరాటే, కుంగ్ ఫూ, జూడో, కలరి పయట్టు వంటివన్నీ మార్షల్ ఆర్ట్స్ కిందే వస్తాయి. ఫైట్‌కి సూట్ అయ్యే ఆర్ట్ నేర్చుకుని బరిలోకి దిగనున్న స్టార్స్ గురించి తెలుసుకుందాం.

మూడు నెలలు బ్యాంకాక్‌లో...

హీరో మహేశ్‌బాబు– డైరెక్టర్ రాజమౌళి కాంబినేషన్‌లో ఓ భారీ చిత్రం రూపొందనున్న విషయం తెలిసిందే. ఆఫ్రికన్ అడవుల నేపథ్యంలో జరిగే ఈ కథలో భారీ యాక్షన్ సన్నివేశాలు ఉంటాయట. పోరాట సన్నివేశాలు సహజంగా ఉండేందుకు కెరీర్‌లో తొలిసారి ఈ సినిమా కోసం మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోనున్నారట మహేశ్ బాబు. ఇందుకోసం మూడు నెలల పాటు బ్యాంకాక్ వెళతారని టాక్. అక్కడ మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ ట్రైనింగ్, హైకింగ్, ట్రెక్కింగ్ వంటివి నేర్చుకోనున్నారట. ఈ శిక్షణ ఇవ్వనున్న బ్యాంకాక్ స్టంట్ టీమ్‌కి ఓ హాలీవుడ్ ప్రముఖ స్టంట్ కొరియోగ్రాఫర్ నేతృత్వం వహిస్తారని తెలిసింది. ప్రస్తుతం త్రివిక్రమ్ దర్శకత్వం వహిస్తున్న 'గుంటూరు కారం'లో నటిస్తున్నారు మహేశ్‌బాబు. ఈ చిత్రం పూర్తయ్యాక బ్యాంకాక్‌లో శిక్షణ తీసుకుని, రాజమౌళి సినిమా షూట్‌లో జాయిన్ అవుతారట. ప్రస్తుతం ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉన్నారు రాజమౌళి. ఈ చిత్రానికి రాజమౌళి తండ్రి విజయేంద్ర ప్రసాద్ కథ అందిస్తున్న సంగతి తెలిసిందే.



● కాజల్

థాయ్‌ల్యాండ్‌లో...

తొలి చిత్రం 'ఉప్పెన'తో (2021) బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్నారు వైష్ణవ్ తేజ్. ఆ తర్వాత 'కొండపొలం, రంగ రంగ వైభవంగా' వంటి చిత్రాల్లో నటించారు. ఈ మూడు చిత్రాల్లో సాఫ్ట్ క్యారెక్టర్‌తో ప్రేక్షకులను అలరించిన ఆయన తొలిసారి 'ఆదికేశవ' చిత్రంలో ఫుల్ యాక్షన్ రోల్ చేశారు. శ్రీకాంత్ ఎన్. రెడ్డి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో హై ఓల్టేజ్ యాక్షన్ సన్నివేశాల కోసం థాయ్‌ల్యాండ్‌లో మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ తీసుకున్నారు వైష్ణవ్ తేజ్. ఈ చిత్రంలో వైష్ణవ్‌కు జోడీగా శ్రీలీల నటించారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ సినిమా ఆగస్టు 18న రిలీజ్ కానుంది.

కలరి మార్షల్ ఆర్ట్‌లో...

మలయాళ హీరో టొవినో థామస్ కలరి అనే మార్షల్ ఆర్ట్‌లో శిక్షణ పొందారు. టొవినో థామస్ హీరోగా నటిస్తున్న చిత్రం 'అజయంతే రండం మోషణం'. జితిన్ లాల్ దర్శకత్వం వహిస్తున్నారు. కథ పరంగా కేరళలోని కలరి అనే మార్షల్ ఆర్ట్‌కు ఈ చిత్రంలో ప్రాధాన్యం ఉండటంతో టొవినో థామస్ ఈ విద్యలో శిక్షణ తీసుకుని నటిస్తున్నారు. ఈ చిత్రంలో కృతీ శెట్టి, ఐశ్వర్య రాజేష్, సురభి లక్ష్మి హీరోయిన్లుగా నటిస్తున్నారు.

భారతీయుడు కోసం...

కమల్‌హాసన్ హీరోగా శంకర్ దర్శకత్వం వహిస్తున్న 'భారతీయుడు 2' కోసం కాజల్ అగర్వాల్ మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ తీసుకున్నారు. 'భారతీయుడు' (1996) సినిమాకి సీక్వెల్‌గా 'భారతీయుడు 2' (తమిళంలో 'ఇండియన్ 2) రూపొందుతోంది. ఈ చిత్రంలో కమల్‌కు జోడీగా కాజల్ నటిస్తున్నారు. ఈ చిత్రంలో పవర్‌ఫుల్ ఫైట్స్ చేయడం కోసం అతిపురాతనమైన యుద్ధ క్రీడ కలరి పయట్టు నేర్చుకున్నారు కాజల్. కలరి సాధన చేస్తున్న ఓ వీడియోను ఆమె సోషల్ మీడియాలో పోస్ట్ చేసి, 'షావోలిన్, కుంగ్ ఫూ, కరాటే, తైక్వాండో.. వంటి క్రీడలు కలరి నుంచి పుట్టుకొచ్చినవే' అని పేర్కొన్నారామె. ఈ మూవీ కోసం గుర్రపు స్వారీ కూడా నేర్చుకున్నారు కాజల్ అగర్వాల్.

కోలీవుడ్‌లో ఫెఫ్సీ కొత్త నిబంధనలు

● సినిమా షూటింగ్‌లకు ఫెఫ్సీ కొత్త నియమాలు ● వెల్లువెత్తుతున్న విమర్శలు

దక్షిణ భారత సినీ కార్మికుల సంఘం (ఫెఫ్సీ) కొత్త నియమ, నిబంధనలు కోలీవుడ్‌లో చర్చనీయాంశమయ్యాయి. తమిళ చిత్రాలకు స్థానిక నటీనటులు, సాంకేతిక నిపుణులు మాత్రమే పని చేయాలని, తమిళ సినిమాల చిత్రీకరణలు తమిళనాడులోనే జరగాలని, సరైన కారణాలు లేనిదే అవుట్‌డోర్ లొకేషన్స్‌లో షూటింగ్ జరపకూడదని ఫెఫ్సీ కొత్త నియమాలు చేసిందని సమాచారం. అలాగే అనుకున్న సమయంలోపు సినిమా చిత్రీకరణ పూర్తి కాకపోయినా, బడ్జెట్ పరిమితి దాటినా నిర్మాతలకు సరైన కారణాలతో లిఖిత పూర్వకమైన లేఖను సమర్పించాలని, ఒకవేళ ఓ సినిమాకు దర్శకుడే రచయిత అయితే, ఆ సినిమా కథకు సంబంధించి ఏదైనా సమస్య ఉంటే అతనే పరిష్కరించుకోవాలని, ఆ సమస్య ప్రభావం షూటింగ్, నిర్మాతలపై పడకుండా జాగ్రత్త వహించే బాధ్యత కూడా ఆ వ్యక్తే తీసుకోవాలన్నట్లుగా కొన్ని నియమాలను 'ఫెఫ్సీ' తీసుకొచ్చిందట. ఈ కొత్త నిర్ణయాలపై కోలీవుడ్‌లోనే కాదు.. సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 'ఈ నిబంధనలు ఉన్నప్పుడు తమిళ సినిమాలను తమిళనాడులోనే రిలీజ్ చేసుకోవాలి. కోలీవుడ్‌లో హీరోయిన్లకు కొరత ఏర్పడుతుంది. సినిమాకి వాడే సాంకేతిక సామాగ్రిని కూడా తమిళనాడులోనే తయారుచేసుకోవాలి' అంటూ ఫెఫ్సీ నియమాలపై సోషల్ మీడియాలో కొందరు నెటిజన్లు వ్యంగ్యాస్త్రాలు విసురుతున్నారు. అయితే ఈ కొత్త నియమాలను కొందరు తప్పుగా అర్థం చేసుకున్నారని ఫెఫ్సీ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి పేర్కొన్నారట.